కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు అందరిని కలుపుకుని కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీ ఫేజ్ 1 నూతన సంక్షేమ సంఘం సభ్యులు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అభినందించి ఎమ్మెల్యే మాట్లాడారు. కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు డేగల సతీష్‌బాబు, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, సలహాదారులు సుధాకర్‌రెడ్డి, సభ్యులు మధుసూదన్ గుప్తా, డేవిడ్ రాజు, శ్రీనివాస్, రసూల్, రమేష్, సోమశేఖరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మహేష్‌కుమార్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ వ్యక్తిగత పనులపై కుత్బుల్లాపూర్‌కు విచ్చేయగా.. ఆయనకు బాలానగర్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గాజులరామారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి తీసుకువచ్చారు. కొద్దిసేపు కార్యకర్తలతో మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు.

24న తిరంగా ర్యాలీ



సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి

నిజాంపేట్: నియోజకవర్గంలో 24న తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి తెలిపారు. బుధవారం ప్రగతినగర్‌లో తిరంగా ర్యాలీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయంత్రం 5 గంటలకు కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ నుంచి కిలో మీటర్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, నాయకులు నరేంద్ర చౌదరి, ప్రసాద్ రాజు, భిక్షపతి యాదవ సుమన్‌రావు, డాక్టర్ రాజు, చక్రధర్, సుబ్బారావు, మదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



లక్ష్మీనారాయణ(ఫైల్)

సుభాష్‌నగర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం శ్రీకృష్ణనగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ(25) ఉద్యోగ వేటలో ఉన్నాడు. ఈ నెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసినా సమాచారం లభించలేదు. సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ ఎస్‌హెచ్‌ఓగా నరసింహరాజు



బాలానగర్: బాలానగర్ సీఐ టి. నరసింహరాజు బుధవారం డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ఉత్తమ ఎస్‌హెచ్‌ఓగా ప్రశంసాపత్రంతో పాటు రివార్డును అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుల పనితీరుపై ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాల్లో సీఐ టి. నరసింహరాజు 9వ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు పూజలు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద శ్రీరంగ నాయక స్వామి వారి దేవస్థానంలో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు బుధవారం తెలిపారు. ఉదయం 6:30 గంటలకు అభిషేకం, సింధూరం పూజ, నాగవల్లి పత్రిక పూజ, విశేష పుష్పాలంకరణ 10:30 గంటలకు మన్యుసూక్తంతో హోమం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

నాణ్యతకు తిలోదకాలు!

- అధికారుల పర్యవేక్షణ కరువు
- నీరు పోయకపోవడంతో బీటలు పడుతున్న సీసీ రోడ్లు
- నెలలు గడుస్తున్నా పూర్తికాని పనులు



అసంపూర్తిగా వదిలేసిన సీసీ రోడ్డు పనులు

చింతల్: అభివృద్ధి పనుల పై అధికారుల నిఘా లేకపోవడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేపట్టి ప్రజాధనం కొల్లగొడుతున్నారు. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో రూ.65 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండు రోజుల్లో రోడ్డు వేస్తామని తవ్వకాలు చేపట్టిన జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్లు రెండు నెలలు గడుస్తున్నా రోడ్డు పనులు చేపట్టకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. దీంతె తమ ఇళ్లల్లోకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రూ.68 లక్షలతో..

భగత్‌సింగ్ నగర్‌లో రెండేళ్ల క్రితం మంజూరైన పనులకు ఇటీవల టెండర్లు నిర్వహించి రూ.64 లక్షలతో రోడ్డు నెంబర్ 2 లో సీసీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు వేసి మూడు నుంచి నాలుగు రోజులు గడుస్తున్నప్పటికీ పనులు చేపట్టే కాంట్రాక్టర్ నీరు పోయక రోడ్డు బీటలు పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు వేసిన మర్నాడు మట్టి దెబ్బలు ఏర్పాటు చేసి నీరు పోయాల్సి ఉన్నా సదరు కాంట్రాక్టర్, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో రోడ్డు నాణ్యత పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గల్లీలకు రోడ్లు బంద్

రోడ్డు నెంబర్ 2 నుంచి సుమారు కుడి, ఎడమవైపులకు 36 గల్లీలకు పైగా ఈ రోడ్డు కూడా వెళ్లే వెసులుబాటు ఉంది. రోడ్డు పేరుతో ఇళ్ల ముందు మెట్లు తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా వెళ్లే గల్లీలను ఏటవాలుగా వదిలేయడంతో గల్లీలకు వెళ్లే రోడ్లు బంద్ అయిపోయాయి. దీంతో వృద్ధులు, చిన్నారులు వెళ్లే క్రమంలో, అత్యవసర విభాగానికి వచ్చే అంబులెన్స్, గ్యాస్‌బండ ఆటోలు, ఇతర వాహనాలు అటువైపు రావడం లేదు. జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి రోడ్డు నాణ్యత పై దృష్టి సారించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.



క్యూరింగ్ చేయని ప్రాంతం

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



గాజులరామారంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న శ్రీశైలంగౌడ్ తదితరులు



బాచుపల్లిలో నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి

పూలమాలలేసి నివాళులర్పించిన నేతలు

కుత్బుల్లాపూర్ : దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికిన ఘనత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చౌడ శ్రీనివాసరావు, దుర్గారావు, నాగిళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలను శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు ఇందిరా, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



జగద్గిరిగుట్టలో నివాళి అర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్యగౌడ్

మీసేవా రాష్ట్ర కార్యనిర్వాహక మీడియా కన్వీనర్‌గా సాగర్‌బాబు



సుభాష్‌నగర్: తెలంగాణ మీసేవా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక మీడియా కన్వీనర్‌గా దూలపల్లికి చెందిన సాగర్ బాబు నియమితులయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల జీవన్ ప్రసాద్ ఈ మేరకు బుధవారం నియామక పత్రాన్ని అందేశారు. సాగర్ బాబు గతంలో మేడ్చల్ జిల్లా మీసేవ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఈ సందర్భంగా పలువురు సాగర్ బాబును సన్మానించారు.

బీజేపీలో చేరిక



పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ శ్రీని గేట్–2కు చెందిన రిటైర్డ్ ఏఈ పోలె గంగాధర్ బుధవారం బీజేపీలో చేరారు. ఆయనకు భరతసింహారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జోగిని రాజు, ప్రవీణ్‌గౌడ్, నవోదయ రెడ్డి, సునీల్ రెడ్డి, గోపీచంద్ రెడ్డి, విక్రమ్, తిరుపతి, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈటలపై విమర్శలు సరికాదు



సతీష్‌సాగర్

కుత్బుల్లాపూర్: అక్రమ కేసులకు భయపడే ప్రసక్తి లేదని, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు నోటీసులు కొత్త కాదని బీజేపీ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు సతీష్ సాగర్ అన్నారు. కాళేశ్వరంపై న్యాయ విచారణ కోసం నోటీసులు పంపిన విచారణకు వెళ్లి నిజాయితీగా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. కొంపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఎంపీ ఈటల రాజేందర్‌ను టార్గెట్ చేస్తూ మాట్లాడుతున్నారని, ఇదే క్రమంలో నోటీసులు రావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి లాంటి వ్యక్తులు నోరు దగ్గర పెట్టుకోవాలని, చిల్లర మాటలు మాట్లాడితే బీజేపీ కార్యకర్తలు ఎదురు తిరిగే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేసే ఈటల రాజేందర్ నాడు తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంతోమంది జైలు పాలయితే వారిని ఆదుకున్నారని గుర్తు చేశారు.

అటకెక్కిన ఎయిర్ వాల్వ్‌ల నిర్వహణ!

- తరచూ లీకేజీలు, గ్రిల్స్‌లేని వైనం
- పట్టించుకోని అధికారులు



షాపూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద..

రంగారెడ్డినగర్: తాగునీటి సరఫరాలో అంతరాయం తలెత్తకుండా నిరాటంకంగా నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఎయిర్ వాల్వ్ నిర్వహణ విషయంపై జలమండలి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కుత్బుల్లాపూర్ జలమండలి డివిజన్ పరిధిలోని పైపులైన్లకు అమర్చిన ఎయిర్‌వాల్వ్‌ల రక్షణకు ఇనుప గ్రిల్ ఏర్పాటు చేయలేదు. కొన్ని ప్రాంతాల్లో అమర్చినా వాహనాలు ఢీకొట్టడంతో గ్రిల్స్ ధ్వంసమయ్యాయి. చాలా ప్రాంతాల్లో ఎయిర్ వాల్వ్‌లు ఉన్నా వాటి నిర్వహణ కొరవడి కలుపు మొక్కలు మొలుస్తున్నాయి. ఎయిర్ వాల్వ్ నుంచి తరచూ తాగునీరు లీకవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. పైపులైన్‌లో గాలి చొరబడి నీటి సరఫరాలో ఆటంకం తలెత్తిన సందర్భంలో ఎయిర్ వ్వాల్ ద్వారా పైపులైన్‌లో ఒత్తిడి పెంచడం, తగ్గించడం ద్వారా సరఫరాను పునరుద్ధరించడానికి ఆస్కారం ఏర్పడుతుంది. నీటి సరఫరాలో కీలకంగా ఉన్న ఎయిర్ వాల్వ్‌ల నిర్వహణలో అధికారులు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. గాంధీనగర్ ప్రధాన రోడ్డుపై ఉన్న ఎయిర్ వాల్వ్ గ్రిల్‌ను రెండు నెలుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఇప్పటి వరకు సదరు గ్రిల్‌ను సరిచేయలేదు. ఐడీపీఎల్, షాపూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జగద్గిరిగుట్ట హెచ్‌ఎంటీ పైపులైన్ రోడ్డులో ఉన్న ఎయిర్ వాల్వ్‌ల నుంచి నిరంతరం తాగునీరు వృథాగా పోతుంది. వాటిని సరి చేయడం లేదు.

స్క్రాప్‌ను తలపిస్తున్న ఎయిర్‌వాల్వ్‌లు

చాలా ప్రాంతాల్లో ఎయిర్ వాల్వ్‌లు భూమిలోకి కూరుకుపోవడం, వాటి చుట్టు గ్రిల్స్ లేకపోవడంతో స్క్రాప్‌ను తలిపిస్తున్నాయి, షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డు నుంచి మార్కెట్ సమీపంలో, షాపూర్‌నగర్ నాలాను ఆనుకుని ఉన్న ఎయిర్ వ్వాల్స్‌కు గ్రిల్స్ లేకపోవడంతో స్క్రాప్ కోసం ఎవరైనా ఊడదీసుకుని వెళ్లే ఆస్కారముంది.



ఐడీపీఎల్ చౌరస్తాలో..



గాంధీనగర్ రోడ్డులో ధ్వంసమైన..



జగద్గిరిగుట్ట పైపులైన్ రోడ్డులో..

3,215 ఎకరాల్లో తగ్గనున్న సాగు !

- శివార్లలో వివిధ పంటల సాగు విస్తీర్ణం 24,900 ఎకరాలు
- వరి 17,251 ఎకరాలు, ఉద్యాన పంటలు 7,348 ఎకరాలు
- విత్తనాలు, ఎరువులు, పంట రుణాలపై వ్యవసాయశాఖ కసరత్తు



సాక్షి,సిటీబ్యూరో: లాభ సాటి పంటలను దృష్టిలో ఉంచుకుని పంటమార్పిడీకి అనుగుణంగా వర్షాకాలం పంటసాగుపై జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళిక ఖరారు చేసింది. పంటసాగుకు సంబంధించిన రైతులకు సరిపడా విత్తనాలు, ఫర్టిలైజర్, పంట రుణాల పంపిణీపై వ్యవసాయశాఖ తగిన చర్యలు తీసుకుంటోంది. వర్షాకాలం పంటసాగులో భాగంగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 24,900 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేసేలా ప్రణాళిక రూపొందించిన వ్యవసాయశాఖ ఇందులో 7,348 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యేలా చర్యలు చేపట్టింది. పంట పెట్టుబడి కింద ప్రభుత్వం ప్రతి ఏటా అందిస్తున్న రైతు భరోసా పథకానికి సంబంధించి రైతులకు జూన్ కల్లా తమ ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా కసరత్తు జరుగుతోందని వ్యవసాయశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

వర్షాకాలం పంటసాగు ప్రణాళిక ఇలా..

మేడ్చల్ జిల్లాలో వర్షాకాలం పంటసాగు విస్తీర్ణం 24,900 ఎకరాలు కాగా.. ఇందులో 7,348 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగుచేసేలా వ్యవసాయ, ఉద్యాన శాఖలు చర్యలు తీసుకుంటోంది. వరి పంటసాగు 17,251 ఎకరాలు కాగా.. కంది, పత్తి , జొన్న పంటలు 520 ఎకరాల్లో రైతులు సాగు చేయనున్నారు. పశుగ్రాసం, పంటసాగు 1,823 ఎకరాల్లో వేసేలా వర్షాకాలం ప్రణాళిక రూపొందించారు. 7,348 ఎకరాల్లో ఉద్యాన పంట సాగులో భాగంగా 4,035 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటల పంటలు, 1,460 ఎకరాల్లో కూరగాయలు, తీగజాతి ఆకుతోట పంటలు, మిగతా 30 పూలతోటలు సాగయ్యేలా వర్షాకాలం పంట ప్రణాళిక ఖరారు చేశారు. వర్షాకాలం పంట సాగుకు అనుగుణంగా సరిపడ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయశాఖ పేర్కొంటోంది.

అందుబాటులో ఎరువులు

మేడ్చల్ జిల్లాకు వర్షాకాలంలో రైతులకు సరిపడా ఎరువులు, ఫర్టిలైజర్ అందుబాటులో ఉంచారు. వీటిలో 2,242 మెట్రిక్ టన్నుల యూరియా, 500 మెట్రిక్ టన్నుల డీఏపీ, 375 మెట్రిక్ టన్నుల ఎంఓసీ, 400 మెట్రిక్ టన్నుల ఎస్ఏఎస్, 2,491 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచారు. ఈ ఎరువులు సొసైటీల ద్వారా రైతులకు విక్రయించేలా జిల్లా వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంది.

పంట రుణాలు రూ.48 కోట్లు

మేడ్చల్ జిల్లాలో 6,522 మంది రైతులకు వివిధ బ్యాంకుల ద్వారా రూ.48 కోట్ల పంట రుణాలు పంపిణీ చేయాలని నిర్ణయించడంతో పాటు అందుకు అనుగుణంగా వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటోంది.

తగ్గిన పంటసాగు ఇలా...

జిల్లాలో గతేడాది వర్షాకాలం పంటసాగు విస్తీర్ణంతో ఈ ఏడాది పంటసాగు విస్తీర్ణాన్ని పోలిస్తే 3,215 ఎకరాల్లో పంటసాగు తగ్గుతోంది. గతేడాది వర్షాకాలంలో పంటసాగు విస్తీర్ణం 28,115 ఎకరాలు కాగా.. ప్రస్తుతం 24,900 ఎకరాల్లో పంటసాగు కాగలదని జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళిక ఖరారు చేసింది. గతేడాదితో పోల్చితే ఉద్యాన పంటల సాగు ఈ ఏడాదిలో 863 ఎకరాల్లో పెరుగుతుండగా, వరిపంట సాగు మాత్రం 1,649 ఎకరాలు తగ్గుతోంది. గతేడాదిలో 6,485 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు కాగా.. ప్రస్తుతం 7,348 ఎకరాల్లో సాగు చేసేందుకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటోంది. గతేడాది వరిపంట 18,900 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ ఏడాదిలో 17,251 ఎకరాలకు మాత్రమే పరిమితమైంది.

విద్యుత్ అధికారుల ఫోన్ నెంబర్ల మార్పు

కుత్బుల్లాపూర్: విద్యుత్ అధికారుల ఫోన్ నెంబర్లు మారాయి. పాత నెంబర్లకు బదులు అధికారులు కొత్త నెంబర్లు కేటాయించారు. మీ ప్రాంతాల్లో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా, ఎలాంటి హెచ్చు తగ్గులు ఉన్నా.. ఇతరత్రా ఏమైనా సమస్యలు ఉన్నా విద్యుత్‌శాఖ అధికారులను ఈ క్రింది ఫోన్ నెంబర్లల్లో సంప్రదించవచ్చు.

సబ్ స్టేషన్స్..

జగద్గిరిగుట్ట	8712472637
కొంపల్లి	8712472641
యూఎంసీసీ	8712472650
పేట్‌బషీరాబాద్	8712472672
సుభాష్‌నగర్	8712472689
దూలపల్లి	8712472674
చింతల్	8712472679

మేడ్చల్ చీఫ్ ఇంజినీర్	8712472515
మేడ్చల్ ఎస్ఈ	8712472516
మేడ్చల్ డీఈ	8712472560
కుత్బుల్లాపూర్ ఏడీఈ	8712472561
గాజులరామారం ఏఈ	8712472564
గాజులరామారం ఎఫ్ఓసీ	8712472592
కుత్బుల్లాపూర్ ఏఈ	8712472570
కుత్బుల్లాపూర్ ఎఫ్ఓసీ	8712472628
పేట్‌బషీరాబాద్ ఏఈ	8712472569
పేట్‌బషీరాబాద్ ఎఫ్ఓసీ	8712472627
కొంపల్లి ఏఈ	8712472568
కొంపల్లి ఎఫ్ఓసీ	8712472594
జగద్గిరిగుట్ట ఏఈ	8712472566
జగద్గిరిగుట్ట ఎఫ్ఓసీ	8712472593

దేశం కోసం పోరాడిన పార్టీ సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్

కుత్బుల్లాపూర్: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన పార్టీ సీపీఐ అని, త్వరలో దేశంలో కమ్యూనిజం రావడం తథ్యమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో మండల కార్యదర్శి ఉమామహేష్ అధ్యక్షతన 4వ మహాసభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తూ లబ్ధి పొందేందుకు యత్నిస్తోందన్నారు. పహల్గాం దాడి నేపథ్యంలో ప్రతిపక్షాలు యుద్ధం చేయమంటే ఈ ప్రభుత్వం వెనక్కి తగ్గిందని అన్నారు. దేశంలో కార్పొరేట్ శక్తులకు సహకరిస్తు ప్రజలు కడుతున్న టాక్స్‌లను వారికి ధారాదత్తం చేస్తోందన్నారు కార్యక్రంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు యూసుఫ్, ఏసురత్నం, జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్, మండల కార్యవర్గ సభ్యులు హైమావతి, ప్రవీణ్, శ్రీనివాస్, నర్సయ్య, నర్సింహారెడ్డి, దుర్గయ్య ఉన్నారు.

ఘనంగా శ్రీచైతన్య విద్యా సంస్థల కన్వెన్షన్



నైపుణ్య శిక్షణ, జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులు

కుత్బుల్లాపూర్: శ్రీచైతన్య విద్యా సంస్థల యాన్యువల్ కన్వెన్షన్ బుధవారం కొంపల్లిలో ప్రారంభమైంది. విద్యా సంస్థల డైరెక్టర్ నాగేంద్ర, ఆల్ ఇండియా అకాడమిక్ కో ఆర్డినేటర్ సతీష్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రాంతం , కులాలు, మతాలకు అతీతంగా శ్రీచైతన్య యాజమాన్యం అభ్యర్థులను ఎంపిక చేసి నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తోందని తెలిపారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి 1500 లకు పైగా ఉపాధ్యాయులు ఈ నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాబ్ మేళాలో 450 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 225 మందిని ఎంపికయ్యారు. కార్యక్రమంలో హైదరాబాద్ కో ఆర్డినేటర్ సురేష్, తెలంగాణ కో ఆర్డినేటర్ జయరాజ్, కొంపల్లి శాఖ ఏజీఎం రమణారావు తదితరులు పాల్గొన్నారు.

నల్ల చెరువు పనులు పూర్తి చేయాలి



నల్ల చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని చెరువు అభివృద్ధి కోసం ఇప్పటికే నిధులు మంజూరైన కారణంగా పనులు త్వరగా పూర్తి చేయాని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం హైడ్రా అధికారులతో కలిసి నల్ల చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు పడినప్పుడు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం కాకుండా పైపులైన్ నిర్మాణం చేపట్టి దిగువకు నీరు వెళ్లే విధంగా చూడాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు సమన్వయం చేసుకొని ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా సత్వరమే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో హైడ్రా అధికారి డీఈ నాగరాజు, జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు సి.సి. చిన్నా రెడ్డి, నిఖిల్ రెడ్డి, నాగప్రియ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.